

చిరంజీవికి పద్మభూషణ్ అవార్డు వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న సన్మాన సభకు రావాలని గవర్నర్ తమిళీ సైని ఆహ్వానించిన ఉపాసన

హైదరాబాద్ వార్త

# ముమ్మరం అయిన ఆపరేషన్ ఆకర్ష్..!

## -అందరి చూపు అధికార పార్టీ వైపు -పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మారనున్న గ్రేటర్ సీన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త**

గ్రేటర్‌లో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ ప్రారంభించింది. గ్రేటర్ పరిధిలోకి వచ్చే 24 నియోజకవరాల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలవలేకపోవడంతో గ్రేటర్‌పై ఫోకస్ పెంచింది. పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ నేతలను తమ పార్టీలో చేర్చుకుంటే పార్లమెంటు ఎన్నికలతో పాటు స్థానిక సంస్థ ల ఎన్నికల్లో పార్టీకి కలిసిసొస్తుందని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. మున్సిపల్ డివిజన్ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ తమవైపునకు తిప్పుకునే అంశంపై ఎక్కువ ఫోకస్ పెంచింది. ఇందులో భాగంగానే ఇటీవలికాలంలో శివార్లలోని ఎమ్మెల్యేలు వచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వెళుతున్నారు. మర్యాదపూర్వకంగానే కలిసామని, నియోజకవర్గాల అభివృద్ధిపరంగా ఎదురవుతున్న సమస్యలను సీఎం వద్ద ప్రస్తావించామని, పరిష్కరించేం దుకు సీఎం హామీలిచ్చారని పైకి చెపుతున్నప్పటికీ లోలో పల వారికి గుబులు వెంటాడుతోంది. నియోజకవర్గాల్లో గతంలో బిఆర్‌ఎస్ పార్టీ గుర్తుపై గెలిచిన వీరంతా ఇపు డు పార్టీ మారే యోచనలోనే ఉన్నారు. అయితే ఫిరా యింపుల చట్టం తమపై పడుతుందేమోనన్న భయం వెంటాడుతున్నా అందుకు కాంగ్రెస్ అగ్రనేతలు తమను రక్షిస్తారన్న భరోసాలు కూడాపెరుగుతున్నాయి. మరీముఖ్యంగా గ్రేటర్‌చుట్టూ ఉన్న నియోజకవర్గాలనుంచే ఇపుడు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఎక్కువ ఉత్సాహం చూపిస్తున్నారు. గతంలో తమ ప్రజాప్రతినిధులపట్ల ఆనాడు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ పార్టీ అనుసరించిన వ్యూ హమే ఇపుడు మళ్లీ అమలుకు వచ్చింది. ప్రస్తుతం జిహెచ్‌ఎంసిలో మొత్తం 150 స్థానాల్లో బిఆర్‌ఎస్ 56, బిజెపి 48(ఇందులో ఒకరు మృతి చెందారు), ఎంఐఎం



44, కాంగ్రెస్ 2 స్థానాలు ఉన్నాయి. మొత్తంగా చూస్తే ఈనెలలోనే సుమారు 14-18మందికిపైగా కార్పొరేటర్లు పార్టీ మారేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. అదే జరిగితే గ్రేటర్‌లో మేయర్‌పదవికి గండం ఏర్పడుతుంద న్నది నేతల మీమాంసగా ఉంది. కూకట్‌పల్లి, సికింద్రాబాద్, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, జూబ్లీహిల్స్, ఎల్బీ నగర్, అంబర్‌పేట నియోజకవర్గాల నుంచి ముగ్గురు, ఇద్దరు, ఒకరు చొప్పున బిఆర్‌ఎస్ కార్పొరేటర్లు గొడదూ కేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

అదేవిధంగా లోక్‌సభ ఎన్నికలలోపే పార్టీని మరింతగా క్షేత్రస్థాయి నుంచి పటిష్టంచేసేందుకు పావులు కదుపుతున్నారు. గతంలో కాంగ్రెస్‌తో సంబంధాలున్న నాయకులు, గతంలో కాంగ్రెస్‌లో పనిచేసిన నాయకులు మొత్తం అందరూ కూడా ఇపుడు కాంగ్రెస్ వైపే చూస్తున్నారు. వీరంతా కూడా తమకు నిర్దిష్టమైన పదవుల హామీతోనే కాంగ్రెస్‌వైపు చూస్తున్నారు. కొందరికి ఎమ్మెల్సీ ఇస్తా మని, మరికొందరికి కార్పొరేషన్ పదవులిస్తామని ఎరవేస్తున్న కాంగ్రెస్ ఆకర్ష్‌కమిటీ కార్పొరేటర్లుకు అయితే తిరిగి తమకు టికెట్ ఇస్తామన్న హామీలు ఇస్తున్నారు. దీనితో గ్రేటర్‌పరిధిలో డివిజన్‌స్థాయినుంచి కూడా పార్టీని మరిం త పటిష్టం చేయడంతోపాటు పార్టీ ఓటుబ్యాంకును, కేడర్ ను పటిష్టంచేసే దిశగా ఇపుడు పార్టీ హైకమాండ్ సూచి స్తున్నట్లు సమాచారం. దీనికితోడు ఇటీవలే ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే స్వయంగా నగరపర్యటనలో బూత్‌లెవెల్ కమిటీలకు నిర్వహించిన సభలో పోలింగ్ కేంద్రం స్థాయి నుంచి జాగ్రత్తగా ఉండాలన్న హెచ్చరికలు జారీచేసారు.

గ్రేటర్‌పరిధిలో ఒక్క నియోజకవర్గం కూడా గెలవకపోవడం అనేది కాంగ్రెస్ పార్టీకి తలకొట్టేసినట్లుగా ఉండటంతో ఇపుడు ఈనియోజకవర్గాల్లో సగానికిపైగా ఎమ్మెల్యేలను తమవైపునకు తిప్పుకునే కార్యాచరణముమ్మరం అయింది. ఆదిశగానే ఇపుడు పార్టీ పరిశీలకులు, వేగులు మంతనాలు ముమ్మరం చేసారు. ఆదిశగానే ఇప్పటివరకూ ముఖ్యమంత్రిని సుమారు ఐదారుగురు ఎమ్మెల్యేలు కలిసి ఆశీస్సులు పొందారని తెలుస్తోంది. గ్రేటర్‌లో పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేదిశగా చూస్తున్నారు. గతంలో ఏ కార్యక్రమం జరిగినా విపరీతంగా బ్యానర్లు, జెండాలను వేలాడదీసే ప్రజాప్రతినిధిపై ముందు ఎక్కువ ఫోకస్ పెట్టారు. అందువల్ల ఇపుడు నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు తమ లొసుగులు ఎక్కడా బయట పడ కుండా ఉండేందుకు కూడా కాంగ్రెస్‌వైపు మొగ్గుచూపిస్తు న్నారన్నది ప్రచారం జరుగుతోంది. అందులోనూ కాంగ్రెస్ సీనియర్‌నాయకుడు, గతంలో ఎంపిగా కూడా పనిచేసిన నాయకుడు జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా రావడం ఈ కా ర్యాచరణకు మరింత బలం చేకూరింది. తన సామాజిక వర్గ నేతలను సమీకరించడంతోపాటు ఇతర ప్రజా ప్రతిని ధులను కూడా నయాన్నోభయాన్నో అక్కున చేర్చు కునే బాధ్యతలను ఆయనకే అప్పగిం చినట్లు తెలుస్తోంది. ఇప్ప టికే కొందరు ప్రజాప్రతినిధులు బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరడానికి పార్టీ పెద్దలతో చర్చలు జరిపి నట్లు పెద్ద ఎత్తున ప్రచారం కొనసాగుతుంది.

# పట్నానికి పైసలివ్వే..!

## -తాత్కాలిక ప్రాజెక్టులు -ప్రధాన ప్రాజెక్టులు అంతే సంగతులు



**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** గ్రేటర్‌లో చారిత్రక మూసీనదితో పాటు నగరవాసులు కలల మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తాత్కాలిక బడ్జెట్‌లో మొండి చేయి చూపింది. కొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రానున్న వేళ రైతులు, పేదలను ఆకర్షించేలా కేంద్ర పద్దుల్లో కొన్ని ప్రకటనలు వెలువడినా మన నగర ప్రాజెక్టులపై శీతకన్ను వేసింది. దీంతో మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పనులతో పాటు మెట్రో రెండో దశ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి పైసా నిధులు అందవన్న విషయం సుస్పష్టమైంది. దీంతో ఈ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టడం లేదా పలు ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సేకరిచం ఈ ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. గుజరాత్‌లోని సబర్మతీ నది తరహాలో మూసీ ప్రక్షాళన, సుందరీకణకు గతంలో 5,500 కోట్లు అవసరమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి గతంలో నివేధించింది. కానీ కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు నిధులు దక్కకపోవడం సిటిజన్లను నిరాశపరిచింది. అలాగే మెట్రో రెండో దశ కోసం పలు మార్గాలను ప్రతిపాదించారు. ఆయా పనులను చేపట్టేందుకు కేంద్రం బడ్జెట్‌లో పైసా నిధులు విడుదల చేయకపోవడం పట్ల నగరవాసులు పెదవి విరుస్తున్నారు. కాగా పద్దులో వేతన జీవులకు ఊరట లభించలేదు. ఎన్నికల నేపథ్యంలో పన్ను విధానాల్లో మార్పుల జోలికి కేంద్రం వెళ్లలేదు. అయితే, ప్రత్యక్ష పన్నులకు సంబంధించి వివాదాస్పద డిమాండ్ నోటీసులు అందుకున్న వారికి ఉపశమనం కల్పించారు. ఆదాయ పన్ను వర్గాలకు ఊరట కల్పించేలా నిర్ణయం తీసుకుంటారని అందరూ అనుకున్నారు. కానీ..వారి ఆశలపై నీళ్లు చల్లుతూ గతేడాది ప్రతిపాదించిన కొత్త పన్ను విధానాన్నే ఈసారి కూడా కొనసాగించారు.

బస్తీలు, అద్దె ఇళ్లల్లో నివసించేవారు తమ సొంతింటి కలను సాకారం చేసుకునే దశగా 'హౌసింగ్ స్కీమ్'ను తీసుకురానున్నారు. సామాన్యులపై విద్యుత్తు బిల్లుల భారం తగ్గించేలా 'రూఫ్ టాప్ సోలార్‌రైజేషన్' పథకాన్ని అమలు చేయనున్నారు. అదాయపు పన్ను కొత్త విధానంలో రూ.7లక్షల వరకు ఎటువంటి పన్ను ఉండదని పునరుద్ఘాటించారు.

## అధ్వానంగా మారిన ఉస్మానియా ఆసుపత్రి పార్క్



అఫ్జల్‌గంజ్, పోలీస్‌స్టేషన్ ప్రక్కనే పార్క్ స్థలంలో గుంతలు తవ్వి వదిలివేసిన దృశ్యం

**అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 1ప్రభాతవార్త:** ఉస్మానియా ఆసుపత్రిలో సుదూర ప్రాంతాలనుంచి వైద్యం కోసం వచ్చే రోగులు కాస్త సేద తీర్చేందుకుగాను నిర్మించిన పార్క్ పూర్తిగా కళాహీనంగా మారి తాగుబోతులకు, అవారాగాళ్లకు అడ్డగా మారింది. ఆసుపత్రి వైద్యఅధికారులు పార్క్ అభివృద్ధి పర్చాలనే ద్యాసలేక పోతుంది. దీంతో గత రెండు నుంచి మూడు సంత్సరాల కాలంగా పార్క్‌లో పిచ్చిమొక్కలు పెరిగి చెత్తాచెదారంతో నిండిపోయింది. హెరిటేజ్ బిల్డింగ్ ఎదురుగా ఉన్న ఇరు వైపుల్లా ఉన్న పార్క్‌లు ఆసుపత్రికి ఎంతో అందంగా కనిపించేవి. ఆసుపత్రి వైద్యాధికారుల నిర్లక్ష్యం మూలంగా పార్క్‌లు అనవాలు కోల్పోయాయి. అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు అనుకుని ఉన్న పార్క్‌లో పూర్తిగా పిచ్చిమొక్కలతోపాటు గుంతలు తీసి వదిలివేశారు. దీంతో అ ప్రాంతం పూర్తిగా అపరిశుభ్రంగా మారింది. అఫ్జల్‌గంజ్ నుంచి ఉస్మానియా ఆసుపత్రికి ఆసుపత్రికి విధులను నిర్వహించేందుకు వచ్చే సిబ్బంది ఈ ప్రధాన ద్వారం గుండా వస్తుంటారు. ఏడమ వైపు ఉన్న పార్క్ మధ్యలో ఉన్న ఫౌంటేన్ పనిచేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. పార్క్‌లో పచ్చదనంతోపాటు పరిశుభ్రంగా ఉంచాలనే ఆలోచన ఆటు వైద్యాధికారులకుగాని, కాని ఇటు ఆసుపత్రి సానిటేషన్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. వారాని ఒకసారైనా ఈ ప్రాంతంలో శుభ్రం చేయాలనే ఆలోచన రెండు విభాగాలలో కనిపించదు. ఆసుపత్రిలో ఉంది కాబట్టి తమ పరిధిలోకి రాదని మహానగర పాలక సంస్థ అధికారులు తప్పించుకుంటున్నారు. ఆసుపత్రి సానిటేషన్ అధికారులు, సిబ్బంది చేత శుభ్రం చేయించాలనే ఆలోచన చేయారు. మార్చురీకి అనుకుని ఉన్న పార్క్ ప్రాంతంలో ఆసుపత్రి చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి మంటలు పెడుతుంటారు. దీంతో చెత్తాచెదారంతోపాటు మూత్ర విసర్జన చేయడంతో అపరిశుభ్రంగా నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని ఎత్తి వేయించి పార్క్ అభివృద్ధికి పాటు పడాలని రోగులు, రోగి సహాయకులు కోరుతున్నారు. కొంత స్థలాన్ని ఫైర్ స్టేషన్‌కు ఇచ్చారు. ఆసుపత్రి పాత భవనం మూసి వేయడంతో పార్క్‌ను పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

## గెలుపు కంటే పోరాటం ముఖ్యం : సీపీ సుధీర్‌బాబు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:**




సమావేశంలో మాట్లాడుతున్న సిపి సుధీర్‌బాబు

క్రీడలు వ్యక్తుల మానసిక వికాసానికి, శారీరక వికాసానికితోడ్పడుతాయని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు పేర్కొన్నారు. సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో గురువారం ఐదో రాచకొండ పోలీస్ కమిషనరేట్ వార్షిక స్పోర్ట్స్ మీట్ 2024 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో ముఖ్య నాగమని, వివిధ రకాల మానసిక, శారీరక ఒత్తిడులను అధిగమించడానికి క్రీడలు ఎంతో ఉపకరిస్తాయని పేర్కొన్నారు. రాచకొండ కమిషనరేట్ పోలీస్ సిబ్బందికి తమ విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడులను, వివిధ రకాల సవాళ్ల నుంచి ఉపశ మనం పొందేలా నూతనత్తేజంతో తమ విధి నిర్వహణలో పాల్గొనేలా చేయడానికి స్పోర్ట్స్ మీట్ ఎంత గానో ఉపయోగపడుతుందిన్నారు. ఈ క్రీడా పోటీల ద్వారా వివిధ రకాల పోలీస్ విభాగాల మధ్య సు హృద్భావ వాతావరణం, సమిష్టితత్వం ఏర్పడుతుందన్నారు. ఈ పోటీల్లో మొత్తం ఎనిమిది జట్లు తలపడనున్నాయని, మినిస్టిరియల్ సిబ్బందికి కూడా ఒక ప్రత్యేక జట్టు ఉంటుందని పేర్కొన్నారు. అన్ని జట్లూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, గెలుపు ఓటముల కంటే పోరాటమే ధ్యేయంగా క్రీడల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. రాచకొండ పరిధిలో పనిచేస్తున్న అన్ని పోలీసు విభాగాల సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది కూడా ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చిన్న వయసు నుంచే క్రీడలలో ప్రోత్సహించాలని, క్రీడల ద్వారా వచ్చే శారీరక మానసిక వికాసం ద్వారా వారి పిల్లలు విద్యలో మరింత మెరుగ్గా రాణించే అవకాశం ఉందని పేర్కొన్నారు. క్రీడల ద్వారా కొన్నిసార్లు విద్యలో కొంతవరకు మార్కులు తగ్గినా అంతిమంగా క్రీడలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతాయని పేర్కొన్నారు. క్రీడల ద్వారా నేర్చుకునే పోటీ, పోరాట తత్వం భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర, ఎస్‌ఓటీ డీసీపీ 1 గిరిధర్ రావుల, ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్‌కుమార్, ఎస్ఓటి డీసీపీ 2 మురళీధర్, మహేశ్వరం డిసిపి సునీ తరెడ్డి, డీసీపీ క్రైమ్స్ అరవింద్ కుమార్, డీసీపీ అడ్మిన్ ఇందిరా, ఎస్బీ డీసీపీ కరుణాకర్, అధికారులు పాల్గొన్నారు.

# నెక్లెస్‌రోడ్‌లో "గ్రాండ్ నర్సరీ మేళా" షురూ



**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:**

గ్రీనరీకి ప్రాధాన్యత ఇస్తూ భవిష్యత్ తరాలకు అహ్లాదకరమైన వాతావరణం అందించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన 15వ గ్రాండ్‌నర్సరీ మేళాను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మన అందిరిపై ఉందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో లభించే అనేక రకాల మొక్కలు ఒకేచోట లభించే విధంగా ఆల్‌ఇండియా హార్టికల్చర్ పేరుతో గ్రాండ్ నర్సరీ మేలాను గత పదేళ్లుగా ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహాకులను అభినందించారు. దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లో పెరిగిన మొక్కలు, మెడిసినల్ ప్లాంట్లు, అర్గానిక్ ఫర్టిలైజర్ ఈమేళాలో అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రజలకు ఇష్టానికి అనుగుణంగా కిచెన్‌గార్డెన్, వర్టికల్ గార్డెన్, టెర్రస్ గార్డెను హ్యాబీగా చేసుకుని చిన్నపాటి గార్డెన్‌ను ఏర్పాటు చేసుకుంటే ఆక్సీజన్‌తోపాటు వర్క్ ప్రెజర్ తగ్గి మానసిక ఉత్సాహాన్ని పొందగలుగుతామని పేర్కొన్నా రు. మేళా ఇంఛార్జ్ ఖాళీద్ అహ్మద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 5వరకు ఉదయం 9గంటలకు నుంచి రాత్రి 9గంటల వరకు నర్సరీ మేళా జరుగుతుందని ఆమేళాలో థాయ్‌లాండ్ లాంటి విదేశాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి 160కిపైగా స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

# పాటిగడ్డలో పిచ్చికుక్క స్వైర విహారం

**-ఆరు మందిని గాయపర్చిన కుక్క**



కుక్క దాడిలో గాయపడిన బాలుడు.

**బేగంపేట ఫిబ్రవరి 1,ప్రభాతవార్త**

జంట నగరాలలో గ్రామ సింహాలు రెచ్చిపోతున్నాయి. ముఖ్యంగా చిన్నారులపై వీటి దాడులు పెరగడంతో చిన్నారులను ఇంటి నుంచి బయటకు పంపాలంటేనే తల్లి దండ్రులు హడలిపోతున్నారు. ఈ మధ్యకాలంలో జంట నగరాలలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన కుక్కల దాడుల ఘటనలలో పలువురు గాయపడ్డారు. ఆ ఘటనలు మరచి పోకముందే బేగంపేట ఓల్డ్‌పాటిగడ్డ లో గురువారం ఉదయం పిచ్చికుక్క దాడిచేసి ఆరుగురిని గాయపర్చింది. ఈ దాడిలో చిన్నారుల నుంచి 60సంవత్సరాల వరకు వారిని ఆ కుక్క దాడి చేసి గాయపర్చడంతో కాలనీ వాసులు తీవ్ర భయాందోళణలకు గురయ్యారు. ఓల్డ్‌పాటిగడ్డ, పైగా ప్యాలెస్ రోడ్డు, బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ, మాతాజీనగర్, ప్రకాష్ నగర్, ఎన్‌బీటీనగర్, భగవంతాపూర్, శ్యాంలాల్ బిల్డింగ్, అల్లం తోట బాయిలలో గ్రామ సింహాలు స్వైర విహారం చేస్తున్నాయి. కొన్ని కుక్కలైతే వాహనదారుల వెంటపడి మరీ గాయపరుస్తున్నాయి. గత నెలలో ఓ మహిళ కుక్కలను వెంట బెట్టుకుని భిక్షాటన చేసుకుంటూ స్థానికులు వేసిన అన్నం, రొట్టెలు ఇతర తినుబండారాలను కుక్కలకు వేస్తుండటంతో ఆమె చుట్టూ పదుల సంఖ్యలో చేరిన కుక్కలు పాఠశాలకు వెళ్లి వస్తున్న చిన్నారులు. ఇళ్ల ముందు ఆడుకుంటున్న చిన్నారులను భయపెడుతూ గాయపరుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. టీఆర్‌ఎస్ యువ నాయకుడు వాహెద్ కుమారుడిని సైతం ఆ మహిళ వెంట ఉన్న కుక్కలు దాడి చేసి గాయపర్చడంతో స్థానికులు ఆ మహిళపై స్థానిక పోలీసుస్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసారు. ముఖ్యంగా కుక్కలు బేగంపేట పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చికెన్ మటన్, ఫాస్ట్‌ఫుడ్ సెంట ర్లు, జంక్షన్లలో మాటు వేసి ఇళ్ల నుంచి బయటకు వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. గురువారం ఉదయం సమయంలో ఓల్డ్‌పాటిగడ్డ కాలనీ, రిజిస్ట్రేషన్ కార్యాలయం వెనుక వైపు, గణేష్ మండపం ఏర్పాటు చేసే ప్రాంతాల్లో ఒక కుక్క చిన్నారులను, యువకు లను, ముసలి వారిపై దాడి చేసి ఎండి.వలి (40), మైసమ్మ (60), జజ్జూ(34), మునాఫ్(38), నయీమ్(30)తో పాటు ఒక చిన్నారిని గాయపర్చింది. దీంతో కొందరు యువకులు ఆ కుక్క దాడి ఘటనను సీసీ కెమెరాలలో పరిశీలించి గుర్తించారు. అదే సమాచారాన్ని జీహెచ్‌ఎంసీ డాగ్ క్యాచర్స్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి దాడి చేసిన కుక్కను కాకుండా ఇతర కుక్కలను పట్టుకుని అక్కడి నుంచి వెళ్లి పోయారని, స్థానికులు, కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇంకొందరు కొన్ని వీధి కుక్కలను పెంచుకుంటుండటం, వాటిని పట్టుకునేందుకు డాగ్ క్యాచర్స్ వచ్చిన సమయంలో ఆకుక్కలను పట్టుకోకుండా వారితో వాగ్వివాదానికి దిగుతున్నట్లు కూడా ఆరోపణలున్నాయి. అలా వ్యక్తి గతంగా కుక్కలు పెంచుకునే వారు నిబంధనలు తప్పక పాటించాల్సి ఉంటుంది. కుక్క మెడలో లైసెన్స్ ఏర్పాటు చేయడంతో పాటు వాటికి వ్యాక్సినేషన్ చేయించాల్సి ఉంటుంది. దాంతో పాటు వాటిని బయటకు తీసుకు వెళుతున్న సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా జీహెచ్‌ఎసీ ఉన్నతాధికారులు దాడిచేసి గాయపర్చిన కుక్కను పట్టుకోవాలని, కుక్కలను తమ ప్రాంతల్లో నుంచి తరలించాలని జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# కండోజీ బజార్‌లో పర్యటించిన తలసాని



కండోజి బజార్‌లో పర్యటిస్తున్న మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని.

**బేగంపేట ఫిభ్రవరి 1,ప్రభాతవార్త**

రాంగోపాల్‌పేట డివిజన్ కండోజీ బజార్ లో గురువా రం మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీని వాస్ యాదవ్ అధికారులతో కల్సి పర్యటించారు. ఈ మేరకు స్థానిక బస్తీ వాసులు కొత్త సీసీ రోడ్, కమ్యూ నిటీ హాలు, ఎస్ఎస్ ఫ్లోరింగ్, ఎలక్ట్రిక్ పోల్స్, డ్రైనేజీ పైప్ లైన్ వంటి పలు సమస్యలను స్థానికులు తలసా ని దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ఆయన వెం టనే పనులను ప్రారంభించాలని వివిధ శాఖల అధి కారులను ఆదేశించారు. అనంతరం నల్లగుట్ట బస్తీ లో బీఆర్‌ఎస్ రాంగోపాల్‌పేట డివిజన్ మైనారిటీ ప్రశిడెంట్ మహ్మద్ యాసిన్ అనారోగ్యంతో బాధపడుతు న్న విషయం తెల్సుకుని ఆయన్ను పరామర్శించారు. అండగా ఉంటానంటూ ఆయనకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తలసాని వెంట మాజీ కార్పోరేటర్ అత్తెల్లి అరుణా శ్రీనివాస్‌గౌడ్, అధికారులు ఉన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:**



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్పష్టం చేశారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్‌లోని సందాని గల్లీలో ఐదు లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ఆయన స్థానిక కార్పోరేటర్ గౌసుద్దీన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ సమస్య ఉన్నా, తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేత ముఠా జైసింహ, స్థానిక డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్, మున్వర్‌చాంద్, రహీం, శంకర్‌గౌడ్, ఆర్.శ్రీనివాస్, వాహబ్, గోవిద్ రాజ్, మక్బుల్, జబ్బార్, హాజీ పాషా, కే.ఎం.సాయి, జీహెచ్‌ఎంసీ అధికారులు డిఈ సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలోని సమస్యలను పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి పలు సమస్యల గురించి కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవో 118 పై ప్రొసీడింగ్ ఆదేశాలు సబ్‌రిజిస్ట్రార్ తహసిల్దార్ వద్ద ఉన్నాయని వాటిని అందరికీ పంపిణీ చేయాలని కోరారు. హయాత్‌నగర్ సర్వే నెంబర్ 255 అసైన్మెంట్ భూమి, మన్సూరాబాద్ డివిజన్ సర్వేనెంబర్ 93/1లో ప్రభుత్వభూమి 2.0 ఎకరాలు ఉండగా ప్రస్తుతం 20 గుంటలు మాత్రమే ఉందని ఆ విషయంపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. సాహెబ్‌నగర్ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంకు సంబంధించి రెండు ఆక్సిఫెన్సీ రైట్ సర్టిఫికెట్లు ఇచ్చారని 1997లో ఒక ఓఆర్సి కూడా ఇవ్వడం జరిగిందని దేవాలయం పూజారికి ఇచ్చిన ఓఆర్‌సికి సంబంధించి విచారణ చేపట్టాలని కోరారు. గ్రీన్‌పార్క్ కాలనీ ఎఫ్‌టిఎల్ పరిష్కారం చూపాలని, నందనవనం జేఎన్‌ఆర్‌ఎమ్ గురించి గతంలో డబల్‌బెడ్ రూములు ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం జరిగిందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా విషయాలకు సంబంధించి సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సమస్యలకు సంబం ధించి అన్ని విషయాలపై వెంటనే తనకు నివేదిక ఇవ్వాలని కూడా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, కందుకూరు ఆర్డీవోలు అనంతరెడ్డి, సూరజ్‌కుమార్, హయాత్‌నగర్, సరూర్‌నగర్ తహసిల్దార్‌లు సునీతరెడ్డి, కృష్ణ, కాలనీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ సోమ్‌లాల్‌నాయక్‌కు నేతల సత్కారం

**ఉప్పల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** హబ్సిగూడలో నివాసి, పద్మశ్రీ సోమ్‌లాల్ నాయక్‌ను గురువారం హబ్సిగూడ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు ఎం.ప్రదీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.కరుణాకర్‌రెడ్డి, రామలింగారెడ్డి, టి.భవత్‌సింగ్, రాజేందర్ తదితరులు ఆయనను సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పద్మ పురస్కారాలలో సాహిత్య రంగంలో సోమ్‌లాల్‌నాయక్ చేసిన కృషికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించడం హర్షనీయమన్నారు. హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీతను బంజారా బాషాలోకి అనువధించారని, ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాలనీ నేతలు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు




స్మశాన వాటికను పరిశీలిస్తున్న అరుణాసురేందర్‌యాదవ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ సూచించారు. నాగోల్ డివిజన్‌లోని ఫతుల్లగూడలో ముక్తిఘట్ హిందూ స్మశాన వాటికను కార్పొరేటర్ గురువారం అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముక్తిఘట్‌లో స్మశానం వాటికలో దహన సంస్కారాలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడలని అధికారులను కోరారు. స్థానిక సమస్యలకు సంబంధించి తాను సహాయ సహకారాలు అందించడానికి ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దాల ఐలయ్య, సంజీవరెడ్డి, పద్మారెడ్డి, రాము గౌడ్, అమర్, అధికారులను తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను కలిసిన సాయిజన్ శేఖర్



మాజీ సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్చాన్ని అందజేస్తున్న సాయిజన్ శేఖర్

**నాచారం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసేందుకు గురువారం అసెంబ్లికి వచ్చిన మాజీ సీఎం కేసీఆర్‌ను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సాయిజన్ శేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేశారు. భగవంతుడి దీవెనలతో కేసీఆర్ ఆరోగ్యంగా కోలుకొని ప్రజా సేవలోకి త్వరితగతిన రావాలని వేడుకుంటున్నట్లు సాయిజెన్ శేఖర్ పేర్కొన్నారు.

## సిఐ ఎలక్షన్‌రెడ్డికి కాంగ్రెస్ నేతల సత్కారం

**ఉప్పల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** ఉప్పల్ సిఐగా నియమితులైన ఎలక్షన్‌రెడ్డిని బుధవారం పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు తవిడ బోయిన గిరిబాబు, బిక్షపతిచారి, మహబూబ్‌అలీ, బెజ్జం యాదగిరి, రవి, టి.ప్రవీణ్, పబ్బు గణేష్ తదితరులు పాల్గొన్నారు. సిఐ ఎలక్షన్‌రెడ్డి ప్రజలకు తమ వంతు చేయూత అందించాలని వారు సూచించారు. ప్రజల కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ఎమ్మార్వోను కలిసిన రాజ్యలక్ష్మి



ఎమ్మార్వో క్రిష్ణ నాయక్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి..

**నేరెడ్‌మెట్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** మల్కాజిగిరి మండల రెవెన్యూ అధికారి క్రిష్ణనాయక్‌ను గురువారం వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి ఎమ్మార్వో కార్యాలయంలో మర్యాపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూముల రక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యానం దినేష్, డివిజన్ అధ్యక్షులు ఓంప్రకాష్, సాయిసురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ఉప్పల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం హబ్సిగూడలో జరిగిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతల సమావేశంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో కొనసాగుతున్న మంత్రులు, స్పీకర్, ఇతర నేతలను తనకు సుపరిచితులని, మీకు ఏ విధమైన పని ఉన్నా వారి వద్దకు వెళ్లి పరిష్కరిస్తానని ఆయన పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీతోనే తాను కొనసాగుతానని, పార్టీ మారే ప్రసక్తే లేదన్నారు. ఫిబ్రవరి 4వ తేదిన మల్లాపూర్‌లోని వియస్ఆర్ గార్డెన్‌లో పార్టీ అన్ని డివిజన్ నేతలు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి కేటిఆర్, హరీష్‌రావులు హాజరవుతారని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు రాగిడి లక్ష్మారెడ్డి, తాడూరి శ్రీనివాస్, కార్పొరేటర్లు బన్నాల గీత, ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతి సాయిజెన్ శేఖర్, మాజీ కార్పొరేటర్లు గంధం జ్యోష్న, పావనీరెడ్డి, గొల్లూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ బ్రిడ్జి అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనని కమిషనర్‌కు వినతి : బిజెపి కార్పొరేటర్లు




జిహెచ్‌ఎంసి కమీషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, శ్వేత మధుకర్‌రెడ్డి, బొక్క భాగ్యలక్ష్మిలు

**సైదాబాద్, మలక్‌పేట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** సైదాబాద్ మెయిన్ రోడ్డుపై చేపడుతున్న స్టీల్‌బ్రిడ్జినిర్మాణాన్ని హనుమాన్ దేవాలయంపైనుంచి వెళ్లకుండా అలైన్‌మెంట్‌ను మార్చి పనులు చేపట్టాలని కోరుతూ బిజెపి కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, జంగం శ్వేత మధుకర్‌రెడ్డి, బొక్క భాగ్యలక్ష్మి మధుసూధన్‌రెడ్డి, ఆలె భాగ్యలక్ష్మిలు గురువారం జిహెచ్‌ఎంసి కమీషనర్ రోనాల్డ్‌రాస్‌కు వినతిపత్రం అందజేశారు. స్టీల్ బ్రిడ్జిని దేవాలయంపై నుంచి నిర్మించడం వల్ల హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని, శాస్త్ర ప్రకారం ఇది అపచారమన్న విషయాన్ని గుర్తించాలని వారు కమీషనర్‌ను కోరారు. తమ విజ్ఞప్తికి కమీషనర్ సానుకూలంగా స్పందించడం జరిగిందని, ఫ్లై ఓవర్ నిర్మాణ వివరాలను పరిశీలించిన అనంతరం ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి తగిన చర్యలు చేపడుతామని హామీనిచ్చారని కార్పొరేటర్లు పేర్కొన్నారు. స్టీల్ బ్రిడ్జి నిర్మాణ అలైన్‌మెంట్‌ను మార్చకుంటే భక్తులతో కలిసి ఉద్యమిస్తామని, అవసరమైతే తమ ప్రాణాలనైనా అర్పిస్తామని వారు స్పష్టం చేశారు.

## కుర్మల్‌గూడలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని కుర్మల్‌గూడ గ్రామ రెవెన్యూ సర్వే నెబర్ 46లో వెలసిన అక్రమ కట్టడాలను గురువారం తెల్లవారు జామున రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అక్రమంగా నిర్మించిన పలుకట్టడాలను జెసిబిలతో కూల్చివేశారు. బాలాపూర్ తహసీల్దార్ మాధవిరెడ్డి ఆధ్వర్యంలో ఆదిభట్ల పోలీసుల భారీ బందోబస్తు మధ్య రెవెన్యూ సిబ్బంది కూల్చివేతలు జరిపారు. అయితే కూలి ్చవేతలను అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారిని అదే విధంగా కూల్చివేతలను నిరసిస్తూ ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నాలకు ప్రయత్ని ్చంచిన పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ఆ తర్వాత రెవెన్యూ సిబ్బంది కూల్చివేతల పనులు నిరాటంకంగా జరిపారు.

## అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి : చెకొలేకార్ శ్రీనివాస్



ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌ను అభినందిస్తున్న చెకొలేకార్ తదితరులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకొలేకార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడిగా నియమితులైన హర్కర్ వేణుగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్ట పడి పని చేసేవారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని, పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంకోసం సిఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలగురించి ప్రజలకు వివరించి వారిని చైతన్యపరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేరెడ్‌మెట్ సీఐగా సందీప్‌కుమార్ బాధ్యతలు

**నేరెడ్‌మెట్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** రాచకొండ పోలిస్ కమీషనరేట్ పరిధిలోని నేరెడ్‌మెట్ పోలిస్‌స్టేషన్ సీఐగా సందీప్‌కుమార్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరెడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకొని నేరాల నియంత్రణకు సంక్షేమ సంఘాల సభ్యులు సైతం తమవంతు సహకారం అందించాలన్నారు.

## పాలకమండలి సమావేశం నిర్వహించాలని కార్పొరేటర్ శ్రావణ్ కోర్టులో పిటీషన్..

**నేరెడ్‌మెట్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసీ పాలకమండలి సమావేశం గత 3 సంవత్సరాలనుండి నిర్వహించడంలేదని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్ పేర్కొన్నారు. పాలకమండలి ఎన్నికలై మూడేళ్ళు గడుస్తున్నప్పటికి కనీసం 30గంటలు కూడా ప్రజా సమస్యలపై చర్చ జరగలేదన్నారు. మూడు నెలలకు ఒక్కసారి లేదా ఆరు నెలలకైనా సమావేశం నిర్వహించాలన్నారు. ఇప్పటివరకు మొత్తం 7 సమావేశాలు జరిగాయన్నారు. అవి కూడా తూతూ మంత్రంగానే నిర్వహించారన్నారు. సమావేశాలు నిర్వహించాలని పలుమార్లు వినతి పత్రాలు అందించినప్పటికి పూర్తిస్థాయి ప్రశ్నలపైన చర్చ చేయలేదన్నారు. సమావేశం నిర్వహిస్తే అవినీతి బయటపడుతుందనే భయంతో సమావేశం నిర్వహించడం లేదన్నారు. దీనిపై కోర్టులో పిటీషన్ దాఖలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా పాలకమండలి సమావేశం సరైన సమాయానికి నిర్వహించాలని కోరారు.

## కర్మన్‌ఘాట్ ఆలయాన్ని సందర్శించాలని మంత్రిని కోరిన ఇఓ, పాలక మండలి



మంత్రికి ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

**సైదాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** చారిత్రక కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు రావాలని దేవాలయ కార్యనిర్వాణాధికారి ఎం.శ్రీనివాసశర్మ, పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డిలు ధర్మకర్తలు, అర్చకులతో కలిసి గురువారం దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. స్వామి వారి ప్రసాదాన్ని, శేష వస్త్రాలను మంత్రికి అందించారు. దేవాలయ అర్చకులు ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు సతీష్‌గౌడ్, అంజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, తిరుమలేష్, ఆనంద్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, శైలజ, సురేష్‌గౌడ్, కిరణ్‌కుమార్,అర్చకులు అంబప్రసాద్, సంతోష్‌శర్మ, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనంలో త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డికి ఘన సన్మానం



గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డికి ఆత్మీయ సమ్మేళనం సన్మాన కార్యక్రమంలో భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్యగౌడ్, బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు ఇంద్రసేనారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, రుత్విక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 16న చేపట్టే గ్రామీణ బంధు దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీన గ్రామీణ బంధు దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం భవన నిర్మాణ కార్మిక యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఆర్కే పురం లేబర్ అడ్డా అధ్యక్షుడు వెంకటయ్య కార్మికులతో సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మిక యూనియన్ రంగారెడ్డి జిల్లా కోశాధికారి జి.చైతన్య, సరూర్‌నగర్ సర్కిల్ సిఐటియు కన్వీనర్ మల్లెపాక వీరయ్య, సర్కిల్ సిపిఎం కార్యదర్శి సిహెచ్.వెంకన్న, డివిజన్‌నాయకులు కే.శ్రీనివాస్, ఎం.గోపినాయక్ హాజరై మాట్లాడుతూ కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతుల సమస్యలు, సామాన్య ప్రజలపై పడుతున్న పన్నులు, అధిక ధరలు నియంత్రించాలని కోరారు. లేబర్ బోర్డు ద్వారా ఎలాంటి షరతులు లేకుండా లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు ఉచితంగా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పరుశరాములు, యేసు, ఎల్లయ్య, వెంకన్న, కార్మికులు పాల్గొన్నారు.

## క్రీడలను ప్రోత్సహించాలి : తీగల కృష్ణారెడ్డి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించాలని టికెఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ తీగల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బాలాపూర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్‌ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలాపూర్ మండల స్పోర్ట్స్ మీట్–2024 లో భాగంగా గురువారం మీర్‌పేట్ మేడిబౌలిలోని టికెఆర్ కాలేజీ క్యాంపస్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన విద్యార్థుల క్రికెట్ పోటీలను క్రికెట్ ఆడి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. విద్యార్థుల కోసం స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించిన అసోసియేషన్‌ను ఆయన అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సిల్వర్ డ్రాప్స్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జనవరి 27న సిల్వర్ డ్రాప్స్ గ్రౌండ్‌లో ప్రారంభించిన స్పోర్ట్స్ మీట్ సందర్భంగా విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, చెస్, క్యారమ్స్ తదితర పోటీలను నిర్వహించి తాజాగా క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు ఫిబ్రవరి 3న సిల్వర్ డ్రాప్స్ గ్రౌండ్స్‌లో జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు,యాదవరెడ్డి, వినీత్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, హనుమంతు, జగన్ మోహన్‌రెడ్డి, హరిబాబు, కిశోర్, మధుసూదన్‌రెడ్డి, వేణు, అమరేందర్‌గౌడ్, శైలేందర్‌రెడ్డి, జార్జి, వీణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

## నేరాల అదుపుకు కృషి చేస్తా : ఇన్‌స్పెక్టర్



సిఐ రవికుమార్‌ను సత్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

**వనస్థలిపురం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బి.రవికుమార్‌ను వనస్థలిపురం జాగృతి అభ్యుదయ సంఘంతోపాటు పలు సంఘాల నాయకులు గురువారం ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఇప్పటిదాకా కొద్ది శాతం మందిలోనే నేర ప్రవృత్తి ఉందని, అది పెరగకుండా నేరగాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ, శాంతి భద్రతలను రక్షించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. సిఐ స్థానంలో తాత్కాలిక విధులు నిర్వహించిన డిఐ వెంకటన్‌ను కూడా సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ భావనా శ్రీనివాస్, బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు చింతపల్లి మంగపతిరావు, సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాదిశేషు, పోచంపల్లి శ్రీధర్‌రావు, సిహెచ్‌విఆర్‌కె మూర్తి, యోగా గురువు ఇస్మాయిల్, శ్రీరంగనాథ్, యాదా రామలింగేశ్వరరావు, శ్రీరాములుగౌడ్, ఓబులేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేస్తాననే నమ్మకంతోనే నన్ను గెలిపించారు: ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



ఎస్ఎన్‌డిపి నాలా పనులకు శంకుస్థాపన చేస్తున ్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** సమస్యలు పరిష్కరించి అభివృద్ధి చేస్తాననే నమ్మకంతోనే ప్రజలు తనను గెలిపించిన ప్రతి ఒక్కరికీ మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీ నబీల్ కాలనీలో రూ.6.40 కోట్లతో చేపట్టిన ఎస్ఎన్‌డిపి నాలా నిర్మాణపు పనులకు ముఖ్యఅతిథిగా హాజరైన సబితాఇంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ ఛైర్మన్ ఫర్హానా నాజ్, పలువురు కౌన్సిలర్లతో కలిసి నాలా పనులకు గురువారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ శివారుప్రాంతాల్లో వరద ముంపు సమస్యల పరిష్కారానికి అప్పటి సిఎం కెసిఆర్ ఎస్ఎన్‌డిపి నాలాల అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిచ్చారని వెల్లడించారు.ఇందులో భాగంగా బాలాపూర్ కొంతమోని కుంటనుండి బాలాపూర్ గుర్రం చెరువువరకు రూ.10కోట్లతో సంబంధిత పనులు జరుగుతున్నాయని అదేవిధంగా వరద నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రత్యేకంగా రూ.6.40 కోట్లతో సైడ్ బాక్స్ నాలాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. వరద ముంపు సమస్యల శాశ్వత పరిష్కారం ద్వారా నబీల్ కాలనీతో సహా 14 కాలనీల్లో ఇక ముంపు సమస్యలకు చెక్ పడినట్లేనని, ఈ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ఎస్.వసంత, మాజీ వైస్ ఎంపిపి అమర్‌బామ్, అహ్మద్ కసాది, యూసుఫ్ పటేల్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్, ఎంఐఎం నాయకులు, స్థానిక కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్లు నాణ్యతగా నిర్మించాలి: మేయర్



రోడ్డు పనుల్లో సూచనలు చేస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:**మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 31వ డివిజన్ బాలాజీనగర్‌లో జరుగుతున్న సిసి రోడ్డు పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరిశీలించారు. గురువారం కాలనీలో పర్యటించిన ఆమె రోడ్డు పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రోడ్డును నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ యాదవ్, శ్యామ్ సుందర్‌రెడ్డి, పి.శ్రీనివాస్, ధర్మేంద్రకుమార్ శర్మ, మనోహర్, శ్రీశైలం, ధనుంజయరావు, రాజ్‌కుమార్, బాలరాజ్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలను కాపాడాలి : పున్న గణేష్



సిఐ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న గణేష్ నేత తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వేంకటేశ్వర్లును గురువారం ఆర్‌కె పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో రాజీపడకుండా ఉండాలని, కాలనీలో గస్తీనిపెంచి నిఘా వ్యవస్థను పటిష్టం ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూధన్‌రావ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్ల రవీంద్ర,రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు ఎన్ఎస్‌యుఐ శివ, దుర్గాప్రసాద్, పొట్టబతిని నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రంలో సదుపాయాలు కల్పించాలి : కార్పొరేటర్ బన్నాల గీత



ఉప్పల్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ సూచించారు. ఈ మేరకు గురువారం ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో కల్పిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఆసుపత్రిని శుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.సౌందర్యలత, బోగ ప్రకాష్, బిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, కె.జగన్, నారాయణరెడ్డి, రామాంజనేయులు, బాలు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** రామంతాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ రాములు తెలిపారు. రామంతాపూర్ దూరదర్శన్ పరిధిలోని హోమియోపతి కళాశాల, ఎన్ఎస్‌టిఐ,ఎస్ఐఇటి తదితరప్రాంతాల్లో ఉదయం 10గంటలనుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.. 2 కెవి చర్చి కాలనీ పరిధిలోని ఇందిరానగర్, నెహ్రూనగర్, ఆనంద్‌నగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

**హబ్సిగూడ పరిధిలో...** హబ్సిగూడ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ రాంరెడ్డి తెలిపారు. హబ్సిగూడ స్ట్రీట్ నెం.8 పరిధిలోని రాజీవ్‌నగర్, సాయిబాబా దేవాలయం, వివినగర్, జిజి కాలనీ, గ్రీన్‌హిల్స్‌కాలనీ, మహేశ్వరినగర్, స్నేహనగర్, వసంత్‌నగర్, బృందావన్‌కాలనీ, సత్యనారాయనగర్, శోభననగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటలనుంచి ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.